క్లుప్తంగా

పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు

వెల్దండ: విద్యార్థులు ప్రణాళికను ఎంచుకోని పట్టుదలతో చదివి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొట్ర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వార్షిక పరీక్షలకు విద్యార్థులు సర్వసిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం కేబీఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష ప్యాడ్స్, పెన్నులను పంపిణీ

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

కల్వకుర్తిరూరల్: మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం చట్టరిత్యానేరమని సీఐ నాగార్జున అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. చాలా ఫిర్యాదులు ట్రిబుల్ రైడింగ్, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, రోడ్డు ప్రమాదాలపై వస్తున్నాయన్నారు. వాహనాలు నడిపే మైనర్లకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. అప్పటికి వినకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

శివుడికి రుద్రాభిషేకం



వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామికి గురువారం మాస శివరాత్రి సందర్భంగా స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పండితులు వేదమంత్రోత్సవాలతో స్వామిని అభిషేకించారు. ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

భక్తిభావంతో మెలగాలి



కల్వకుర్తిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జీడిపల్లిలో ఖాజాబందే నవాజ్ ఉర్సులో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు ప్రశాంత వాతావరణానికి అలవాటు పడాలంటే దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

కల్వకుర్తిరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ కేశవరావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా ప్రజలను చైతన్యం చేసి ప్రజావ్యతిరేఖ కార్యకలాపాలపై క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడా ఆందోళనలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణ, యూసోఫ్, నాగన్న, పృథ్వీరాజ్, రామస్వామి, ఆంజనేయులు, చందు, రేణుక, సృజన, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

కొల్లాపూర్ రూరల్: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులకు భంగం కలిగిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ కవితకు కార్మికుల తరుపున సమ్మె నోటీసు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల బతుకులు ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కార్మికుల వేతనాలు రూ.26వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలలో ఉద్యోగాలు భర్తీ చేయడంలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందన్నారు.

జీల్దార్‌తిప్ప చెరువుకు సాగునీరివ్వాలి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడి గుండం, మొలచింతలపల్లి సమీపంలో ఉన్న జీల్దార్‌తిప్ప చెరువుకు కేఎల్ఐ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం సాగునీరు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్థం పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ముక్కిడిగుండంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏళ్లుగా జిల్లాకు సాగునీరు అందిస్తామని మాటలు చెబుతున్న ప్రభుత్వాలు ఆచరణలో పెట్టడం లేదన్నారు. ఖరీఫ్ నాటికి ముక్కిడిగుండం, మొలచింతలపల్లికు సాగునీరు ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

గిరిజనులు తరలిరావాలి

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలో సంత్ సేవాలాల్ ఉత్సవాల పనులను మున్సిపల్ కమిషనర్ రాజయ్య గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతు 15న సేవాలాల్ జయంతిని ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమానికి గిరిజనులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ



కాంసానిపల్లి పల్లెప్రకృతివనంలో మొక్కలకు నీరు పడుతున్న ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఉపాధి పథకంలో నిర్వహించే పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ గంగమోహన్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు తక్కువ కావడం వల్ల కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి గ్రామంలో 80–100 మంది కూలీలు పాల్గొనే విధంగా క్షేత్ర సహాయకులు కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. ఇక నుంచి కూలి చెల్లించడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ముందస్తుగా గ్రామసభలో ఎంపిక చేసుకున్న పనులను పూర్తి చేయించాలన్నారు.

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో 15 రోజులకు ఒక సారి ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి కార్యదర్శులు పారిశుద్ధ్య పనులపై శ్రద్ధ కనబరచాలని ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, ఎంపీడీఓ గంగమోహన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంతో పాటు యాదిరెడ్డిపల్లి, యంగంపల్లి సందర్శించి సమస్యలను గుర్తించారు. గుర్తించిన సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలనే అంశాలకు ప్రణాళిక ప్రకారం పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పల్లెప్రకృతి వనాలపై..

ఉప్పునుంతల: పల్లెప్రకృతి వనంలో నాటిన మొక్కల సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. గురువారం పంచాయతీ ప్రత్యేకాధికారి హోదాలో ఎంపీడీఓ మండలంలోని కాంసానిపల్లిలో నర్సరీని, పల్లె ప్రకృతి వనాన్ని సందర్శించి కార్యదర్శి రాజేష్, కూలీలతో మాట్లాడారు. ఎండాకాలం వస్తున్నందున మొక్కలకు నీరు పట్టాలని సూచించారు. నర్సరీలో మొక్కల సంరక్షణపై శ్రద్ధ తీసుకుని వాటికి తరుచుగా నీటి తడులు ఇవ్వడంతోపాటు అవసరమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి..

వెల్దండ: తమ ఇళ్ల చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రత్యేక అధికారి శ్రీనివాసులు



తాడూరులో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడి, మహిళా సంఘాలు, పంచాయతీ సిబ్బంది శ్రమదానం నిర్వహించారు. ఇళ్ల మధ్యలో, రోడ్లకు ఇరువైపుల పిచ్చి మొక్కలను తొలగించారు. ఇళ్ల ముందు మురుగు నిల్వలేకుండా చూడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. తడిచెత్త, పొడి చెత్త సేకరణ, ప్రత్యేక శానిటేషన్ తదితర వాటికి ప్రజలకు వివరించారు.

సమస్యలను తెలపండి..

చారకొండ: గ్రామాలో సమస్యలను తమ దృష్టికి తెలవాలని, వాటి పరిష్కారానికి కృషి ప్రత్యేక అధికారి వెంకటేష్ అన్నారు. మండల కేంద్రంలో, శాంతిగూడెం పంచాయతీ కార్యాలయాల్లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో పర్యటించి నీటి, పారిశుద్ధ్య సమస్యలను గుర్తించినట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన..

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్ పంచాయతీలో ప్రత్యేకాధికారి ఆంజనేయులు పర్యటించారు. అనంతరం ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఫీడర్ ఛానల్ పనులు, చెరువుల్లో మట్టి తవ్వకాన్ని పరిశీలించి కూలీలకు పలు సూచనలు చేశారు.

పెద్దకొత్తపల్లి: గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో కూలీలందరికి పనులు కల్పించాలని ఏపీఓ మంజుల అన్నారు. మండల కేంద్రంలో ఫీడర్ ఛానల్ పనులను గురువారం పరిశీలించారు. కూలీలందరికి పనుల వద్ద తాగునీటి వసతి కల్పించాలని సూచించారు.

గ్రామసభలో గ్రామస్తులు నీటి సరఫరా సంబంధిత సంబంధిత పైపులైన్ లీకేజీని తెలపారు. నర్సరీలను పరిశీలించి వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రీన్ మ్యాట్, నీళ్లు పెట్టడం, కలుపు నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

లింగాల: స్పెషల్ డ్రైవ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు కార్యదర్శులతో కలిసి వార్డులలో తిరుగుతూ అమలు చేయాల్సిన పనులను గుర్తిస్తున్నారు.



వెల్దండలో శ్రమదానం నిర్వహిస్తున్న అధికారులు



చారకొండలో మట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేష్

రోడ్డుపైనే సంత వ్యాపారాలు

- రాకపోకలకు ఇబ్బందులు
- నడవలేని పరిస్థితి

అచ్చంపేట రూరల్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో ప్రతి వారం ఏర్పాటు చేసే ఆదివారం సంతలో తీవ్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. సంతను దారులపైనే ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను మున్సిపల్ అధికారులు, పోలీసులు చూసినా పట్టించుకోవటం లేదు. పట్టణంలోని పాతబజారు నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లాలంటే నడవలేని పరిస్థితి ఉంటుంది. జన సంచారం అధికంగా ఉండటంతో ఆ ప్రాంతంలో వ్యాపారాలు సాగుతాయి. చాలా వరకు అక్కడ కూరగాయలు కొనుగోలు చేస్తుంటారు. రైతుబజార్ ఉంటే కొనుగోలుదారులు అక్కడికి వెళ్లేవారు. వారమనే కాకుండా ప్రతి రోజూ అలాగే ఉంటుంది. తోపుడు బండ్లు రోడ్డుకు అడ్డంగా పెట్టుకుని వ్యాపారాలు చేస్తుంటారు. ఎవరన్నా తోపుడు బండిని పక్కకు తీయమని చెబితే వారిపై దాడులకు యత్నిస్తుంటారు.



అచ్చంపేటలోని కూరగాయల వారాంతపు సంత

గతంలో సమస్య కొలిక్కి వచ్చినా...

మున్సిపల్ అధికారులు, పాలకవర్గం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో కొన్ని రోజులు రోడ్లపై వ్యాపారాలు సాగలేదు. మహిళలు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మున్సిపల్ పాలకవర్గం మారడంతో అలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో యధాస్థితికి చేరింది. ప్రస్తుతం విచ్చలవిడిగా వ్యాపారాలు సాగుతున్నాయి. మున్సిపల్ అధికారులు, పోలీసులు ఎవరికి వారు చేతులెత్తేస్తుండటంతో పరిస్థితి మరింత జఠిలం అవుతోంది.

కొత్త ఓటర్ల జాబితా విడుదల



చారకొండలో ఓటరు జాబితా విడుదల చేస్తున్న తహసీల్దార్

కల్వకుర్తి: నియోజకవర్గ తుది ఓటర్ల జాబితాను ఆర్డీఓ శ్రీను గురువారం విడుదల చేశారు. అసెంబ్లీలోని 262 పోలింగ్ కేంద్రాలలో పురుషులు 1,22,805, స్త్రీలు 1,20,148, ఇతరులు 9 మందితో కలిపి 2,42,962 ఉన్నారని ఆయన తెలిపారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు నూతనంగా ఓటును నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

చారకొండ: మండలంలోని ఓటరు తుది జాబితాను తహసీల్దార్ ప్రమీల గురువారం విడుదల చేశారు. మండలంలోని 17 పంచాయతీల ఓటరు జాబితాను, అయా గ్రామాల్లో పోలిగ్ బూత్ లెవల్ అధికారులతో మట్లాడి వారికి తుది ఓటరు జాబితాను బూత్‌లెవల్ అధికారులకు అందజేశారు. అచ్చంపేట్ నియోజకవర్గం 14, కల్వకుర్తి నియోజకవర్గం 7 కేంద్రాల్లో సంబంధించి జాబితాను విడుదల చేసి, పంచాయతీ కార్యాలయాల్లో ఓటరు జాబితాను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ విద్యాధరి, ఆర్ఐ మహ్మద్ నబీ తదితరులు ఉన్నారు.

ఓటుహక్కు పొందాలి..

వెల్దండ: 18ఏళ్ల పూర్తయిన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం కార్యాలయంలో మండలంలోని 35 పోలింగ్ కేంద్రాల తుది ఓటర్ జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్ఓల వద్ద ఓటర్ నమోదు చేసుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి పౌరుడు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనువాస్, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

బీమాతో కుటుంబాలకు భరోసా

తెలకపల్లి: బీమాతో కుటుంబాలకు భరోసా ఉంటుందని వనపర్తి పోస్టర్ డివిజనల్ అధికారి దోర్నాల సత్తయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవన సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలకపల్లికి చెందిన గుండూరు తిరుపతయ్య ప్రమాదబీమా పాలసీ రూ.399 చెల్లించి తీసుకోగా, ఇటీవల ప్రమాదవశాత్తు ఆయన మృతి చెందారని తెలిపారు. ఆయనతో పాటు రూ.430తో పాలసీ తీసుకున్న చాంద్‌పాషా, కుమ్మరి వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. తిరుపతయ్య కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు, కుమ్మరి వెంటయ్య, చాందుపాషా కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాల శాఖ ప్రజలకు అందుబాటులో ఉంటూ పొదుపు పథకాలు, జీవిత బీమా పథకాలను అందిస్తుందన్నారు. మారుమూల ప్రాంతాలలో కూడా అందు



బాధితులకు చెక్కులు అందజేస్తున్న అధికారులు

బాటులో ఉంటుందన్నారు. జిల్లా తపాల అధికారి నర్సింహ ఎస్బీఆర్‌జీ, ఆర్‌పీఎల్ఐ, పీఎల్ఐ, ఎస్ఎస్ఏ, ఖాతాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనాథ్, ఎస్ఎస్‌పీ ప్రసాద్, ఎస్‌పీఎం నర్సింహ, మహమూద్‌ఖాన్, జగన్‌గౌడ్, ఏపీఎం నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

ఊర్కొండ: మండల ఎస్ఐగా వీరబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పనిచేసిన ఎస్ఐ లెనిన్ ఉప్పునుంతలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని చెప్పారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలి

చారకొండ: మండలంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని మండల రెడ్‌క్రాస్ కార్యదర్శి పరంజ్యోతి గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల ప్రమాదాలు, మహిళలు రక్తహీనతతో బాధపడుతున్న సందర్భంగా శిబిరం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

11న గురుకుల ఉమ్మడి ప్రవేశ పరీక్ష

మన్ననూర్: గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు ఆయా గురుకులాల్లో 5వ తరగతిలో చేరేందుకు 11న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పీటీజీ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి గురువారం ప్రకటనలో తెలిపారు. పీటీజీ పాఠశాలలో నిర్వహించే ప్రవేశ పరీక్ష సెంటర్ కోడ్ 241812 ద్వారా 384 మంది పరీక్ష రాసేందుకు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్, ప్యాడ్, బ్లాక్ లేదా బ్లూ పెన్, ఆధార్ కార్డు తీసుకుని ఉదయం 9గంటల లోపు కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.

బాధ్యతలు చేపట్టని ప్రత్యేకాధికారి

కల్వకుర్తిరూరల్: మండలంలోని జీడిపల్లి, జీడిపల్లి తండా, వెంకటాపూర్‌లకు ప్రత్యేకాధికారిగా వ్యవసాయ శాఖ ఏఓ శ్రీలతను నియమించారు. మండలంలోని అన్ని గ్రామాలకు ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టి పనులు చేస్తున్నా ఇక్కడ మాత్రం ససేమిరా అనడం చర్చనీయాంశంగా మారింది. జీడిపల్లిలో మూడు రోజులుగా ఉర్సు కొనసాగుతుంది. ఈ ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు బంధువులు తరలివస్తున్నారు. అక్కడ పారిశుద్ధ్యం, తాగునీటి వసతి తదితర అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత ప్రత్యేకాధికారిపైనే ఉంది. సర్పంచ్‌లు లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. బాధ్యతలు తీసుకోవడానికి వెనుకంజ వేయడంతో పాటు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎంపీడీఓ ఆంజనేయులును వివరణ కోరగా, చెప్పినా వినడం లేదని, నాకెందుకు ఇచ్చారని ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని తెలిపారు. కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారిని అడగాలని సూచించామన్నారు. బాధ్యతలు తీసుకోకపోవడం సరికాదని కలెక్టర్‌కు నివేదిక పంపిస్తున్నట్లు ఎంపీడీఓ వివరించారు.

ప్రాక్టికల్స్ పేరుతో వసూళ్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాల యాజమాన్యం ప్రాక్టికల్స్ పేరుతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తుందని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న గురువారం జిల్లా నోడల్ అధికారి వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కాలేజీలు సిండికేట్‌గా ఏర్పడి విద్యార్థులతో నెలకు రూ.వేలకు వేలు వసూలు చేస్తూ జీవితాలతో ఆటలాడుకుంటున్నారని ఆరోపించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురియంబర్స్‌మెంట్ పేరుతో కళాశాలలో అడ్మిషన్లు కల్పించి తదనంతరం ఇలాంటి వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు కళాశాలలపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బక్క కృష్ణ, భీమయ్య, జమదగ్ని, అంజి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



నోడల్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గవర్నర్ నిరంకుశ వైఖరి నశించాలి



అంబేద్కర్‌చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: కేరళ వామపక్ష సీపీఎం ప్రభుత్వంపై అక్కడి గవర్నర్ నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని, వైఖరిని వీడనాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తాలో నిరసన తెలిపారు. కక్ష సాధింపు దోరణి అవలంభిస్తున్నారని, బీజేపీ పట్టు సాధించాలనే కక్షపూరితమైన వ్యవహారంతో అక్కడి ప్రభుత్వాన్ని అబాసు పాలు చేయడానికి గవర్నర్ హారీఫ్ అహ్మద్‌ఖాన్ ద్వారా అనేక ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులకు ఆమోదం తెలపకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాలకు అధిక నిధులు ఇచ్చి, అక్కడి ప్రభుత్వాలకు ప్రాధాన్యత ఇచ్చి దక్షిణాది రాష్ట్రాలను విస్మరించడం మోదీ ఏకపక్ష విధానాలకు నిదర్శనం అన్నారు. దీంతో కేరళ ప్రభుత్వానికి రావాల్సిన నిధులు రాక బిల్లులు ఆమోదింపకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామయ్య, శివ, సత్యనారాయణ, వీరేంద్ర, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడింగ్ కార్మికుల ఆందోళన

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ సబ్ డివిజన్‌లో 15ఏళ్లుగా పనిచేస్తున్న మీటర్ రీడింగ్ కార్మికులకు నెలనెల జీతాలు ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు లింగం శేఖర్, నవీన్‌కుమార్ కోరారు. పెద్దకొత్తపల్లి సబ్ స్టేషన్‌లో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15ఏళ్లుగా విద్యుత్ శాఖలో పని చేస్తూ ప్రతి నెల ఇంటింటికీ తిరుగుతూ మీటర్ బిల్లు రీడింగ్ తీసి వినియోగదారులకు అందజేస్తున్నా తమకు కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మీటర్ రీడింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు కేవలం కమీషన్ మాత్రమే చెల్లిస్తున్నారు. మాకు కనీస వేతనం చెల్లించి ఆర్టిజన్‌లుగా గుర్తించాలని పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నవీన్,లింగం, రాజు తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లి సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న మీటర్ రీడింగ్ కార్మికులు

ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంల వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్‌రూరల్: ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు జీతాలు చెల్లించకుండా కాంట్రాక్ట్ ఏజెన్సీ తీవ్ర నిర్లక్ష్యాన్ని వహిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ ఆరోపించారు. గురువారం స్థానిక లక్ష్మణాచారి భవనంలో ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి మారెడు శివశంకర్ అధ్యక్షతన నిర్వహించిన ఏఎన్ఎంల సమావేశంలోఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలకు జీతాలు చెల్లించకుండా తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అన్యాయంపై వివరించి సంబంధిత ఏజెన్సీలను తొలగించేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఉపకార్యదర్శి నర్సింహ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలు రెండు సంవత్సరాల క్రితం వచ్చినటువంటి కరోనా సందర్భంలో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ వారి సేవలను కింద వరకు తీసుకెళ్లిందని, వారికి జీతాలు చెల్లించకుండా తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. కార్యక్రమంలో పద్మ, శ్రీలత, వరలక్ష్మి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాడ్జీల పంపిణీ

అమ్రాబాద్: తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల్లో చదువు చెబుతున్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు గురువారం కళాశాలలో తొలిమెట్టు పుస్తకాలు, బ్యాడ్జీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధుసూధన్ మాట్లాడుతూ కళాశాల నుంచి జాతీయ సేవాపథకంలో భాగంగా విద్యార్థులు పాఠశాలల్లో చదువులు బోధించడం అభినందనీయమని అన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, బ్యాడ్జిలు అందజేస్తున్న ప్రిన్సిపాల్

దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు



స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

అచ్చంపేట రూరల్: దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని అవి మనిషిలో మంచి ప్రవర్తన తెచ్చే నిలయాలు కావాలని త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి అన్నారు. గురువారం మండలంలోని అంకిరోనిపల్లిలో పద్మావతి అలర్మేల్ మంగ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సమతాదీక్ష మాలధారణ కార్యక్రమం చేపట్టారు. అమ్రాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధతో పాటు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

బైపాస్ రోడ్డు వద్దని నిరసన



రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, నిర్వాసితులు

చారకొండ: జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చారకొండ నుంచి మర్రిపల్లి వరకు చేపట్టిన బైపాస్ రోడ్డు పనులు వెంటనే నిలిపి వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. మండల కేంద్రం గుండా ఉన్న పాత రోడ్డు విస్తరించాలని గురువారం అంబేడ్కర్ సర్కిల్‌లో గ్రామస్తులు, ఇంటి స్థలాలు, భూములు కోల్పోతున్న నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. వీరికి కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. జడ్చర్ల నుంచి మల్లేపల్లి వరకు రోడ్డు నిర్మాణంలో ఎన్ని మూల వంపులుగా ఉన్న ఎక్కడ బైపాస్ చేపట్టకుండా, మండల కేంద్రంలో బైపాస్ చేపట్టడం ఏంటని ప్రశ్నించారు. బైపాస్ వల్ల ఎంతో మంది ఇళ్ల స్థలాలు, భూములు కోల్పోతూ నిరాశ్రయులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బైపాస్ వల్ల మండల కేంద్రం అభివృద్ధిలో మరింత వెనుకబడుతుందని తెలిపారు. ఉన్న రోడ్డును విస్తరిస్తే గ్రామస్తులకు, వ్యాపారులకు అన్ని రకాలుగా దోహదపడుతుందని తెలిపారు. నిరసనతో ప్రధాన రహదారిపై గంటన్నర పాటు వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు సముదాయించి విరమింపజేశారు.